


మనకూ ఒకరోజు కావాలి.. మన నచ్చినట్టు ఉండాలి.. పదిమందితో కలిసి ఆనందంగా గడపాలి.. గంతులు వేయాలి.. ఆటలు ఆడాలి.. పాటలు పాడాలి.. డ్యాన్స్ చేయాలి.. ఆ రోజంతా ఖాళీగా గడపాలి.. ఇలా ఏడాదికి ఓ రోజు.. చాలు ఏడాదంతా జ్ఞాపకం చేసుకుంటూ బతికేస్తాం.. ఇదీ ప్రస్తుత తరం ఆలోచన. ఎందుకంటే బిజీ జీవితం.. తీవ్ర ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు.. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ పరుగులే.. ఎక్కడా ఖాళీ ఉండదు.. సాయంత్రానికి ఖాళీగా కూర్చుని ఆలోచిస్తే ఇంతేనా జీవితం అనిపిస్తుంది.. ఎందుకంటే ప్రస్తుతం ఉమ్మడిగా చేసుకునే పండుగల్లేవ్.. సరదాగా కలుసుకునే సందర్భాల్లేవ్.. వచ్చామా.. వెళ్లామా అంతే.. అందుకే కార్తీక మాసం సందర్భంగా ఏడాదికో మారు పిక్నిక్ పెట్టుకుంటున్నారు.. కుటుంబీకులు, స్నేహితులు కలిసి రీఫ్రెష్ అవుతున్నారు.. మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాల అని ముత్యాల ముగ్గు సినిమాలో రావుగోపాలరావు అన్నట్టు.. ఆ రోజంతా తమ కళాపోషణ బయటపెడుతున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపి బై బై చెప్పుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.. ఆనందంగా గడిపేందుకు మనకు ఎన్నెన్నో అందమైన పిక్నిక్ స్పాట్‌లు ఉన్నాయి.. అవేంటో ఒకసారి చూసేద్దాం!


అంతర్వేది


కడియం పూలసోయగం

ఆదివారం ప్రత్యేకం

ఆంధ్రా కేరళ కోనసీమ


ఓడలరేవు

పచ్చని అందాలకు నెలవు కోనసీమ.. ఎటుచూసినా పచ్చదనమే.. ఏవైపు చూసినా పిక్నిక్ స్పాట్‌గానే ఉంటుంది.. ఎందుకంటే ఆంధ్రా కేరళ.. ఎత్తయిన కొబ్బరిచెట్లు.. పచ్చదనంతో నిండిన చేల మధ్య నుంచి నల్లటి తారు రోడ్లపై వెళుతుంటే ఆ అనుభూతే వేరు.. కేశవదాసుపాలెం, కేశనపల్లి, ఓడలరేవు, వాసలతిప్ప, ఎస్.యానాం బీచ్‌లతో పాటు గోదావరి తీరప్రాంతాలైన యానాం, కోటిపల్లి, ముక్తేశ్వరం, ఆదుర్రు, సోంపల్లి, దిండి రిసార్ట్స్, లొల్లలాకులు తదితర ప్రాంతాలు పిక్నిక్ స్పాట్‌లుగా ప్రసిద్ధికెక్కాయి. వీటితోపాటు ఆధ్యాత్మిక ప్రాంతాలైన అంతర్వేది, అప్పనపల్లి, అయినవిల్లి, మురమళ్ళ, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. కోనసీమకు ఓవైపు గోదావరి.. మరోవైపు బీచ్ ఉండడం గమనార్హం. కోనసీమకు వెళ్లేందుకు రావులపాలెం, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మీదుగా బస్ సౌకర్యం ఉంది. రావులపాలెం మీదుగా అంతర్వేదికి 65 కి.మీ. ఓడలరేవు అయితే 51 కి.మీ.. పాలకొల్లు నుంచి అంతర్వేది అయితే 26 కి.మీ ఉంటుంది.


తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో శనివారం మహిళల పిక్నిక్ సందడి

'తూర్పు'న అందాలు

అన్ని అందాలు కలగలిపినదే తూర్పుగోదావరి జిల్లా.. ఒకవైపు గోదావరి.. మరోవైపు కడియం పూలతోటలు.. ఇంకోవైపు కోరుకొండలో పాండవుల మెట్ట.. గోకవరంలో సూదికొండ.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కాటన్‌మ్యూజియం, గోదావరి అందాలు.. పెరవలి మండలం తీపర్రు గోదావరి చెంతనే ఇసుక తిన్నెలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నోఎన్నెన్నో.. ఇక రాజమహేంద్రవరం పట్టణవాసులకు అయితే నగరంలో దివాన్‌చెరువు వద్ద ఉన్న పుష్కరవనం.. లోపలకు వెళితే మళ్లీ రావాలనిపించదు. ఎందుకంటే చుట్టూ చెట్ల మధ్యన పిక్నిక్ అద్భుతం.. బిజీ జీవితం గడిపే పట్టణవాసులకు ఈ పుష్కరవనం ప్రత్యేకమనే చెప్పాలి. ఎందుకంటే ఒకటా రెండా సుమారు 250 ఎకరాలపైనే ఈ పార్కు విస్తీర్ణం. ఒక 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలు ఉంటాయి. తరువాత ఎటు చూసినా పచ్చనిచెట్లు గుబురుగా గుబురుగా పెరిగి ఉంటాయి. తూర్పుగోదావరి జిల్లాలో పిక్నిక్ స్పాట్లకు రాజమహేంద్రవరం నగరం నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఉంది.. ఇక రాజమహేంద్రవరం రావడానికి విమానయానం, రైలు, బస్ తదితర సదుపాయాలు ఉన్నాయి.

రారండోయ్.. చూసొద్దాం!



ఉమ్మడి జిల్లాలో ఎన్నెన్నో అందాలు

(కాకినాడ/ అమలాపురం/ రాజమహేంద్రవరం సిటీ/ దివాన్‌చెరువు/ కడియం/పెరవలి, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పిక్నిక్‌ల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో ఎక్కడికక్కడ జనం గార్డెన్ పార్టీలతో సందడి చేస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, వివిధ సామాజికవర్గాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ యూనియన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు ఎవరికివారే పిక్నిక్‌ల బాటపడుతున్నారు. ఆదివారం రోజైతే ఉమ్మడి జిల్లాలో మామిడి, కొబ్బరి తోటలు, గోదావరి గట్లు, పార్కులు పిక్నిక్‌లతో సందడిగా మారుతున్నాయి. కాకినాడలో అయితే సర్పవరం జంక్షన్, ఇంద్ర పాలెం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తునిరూరల్‌లోని అనేక ప్రైవేటు గార్డెన్లు, గెస్ట్‌హౌస్‌లు, కొబ్బరితోటల్లో పిక్నిక్‌లు భారీగా జరుగు తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం తదితర ప్రాంతాల్లో తోటలు, నర్సరీలు గోదావరి ఇసుక తిన్నెలు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరితోటలు, సముద్రతీరం వెంబడి, గోదావరి పాయల వెంబడి ఇసుక మధ్యలో సరదాసరదాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సామాజికవర్గాల వారీగా నిర్వహించే పిక్నిక్‌లు అయితే ఓ భారీ ఈవెంట్‌నే తలపిస్తాయి. డీజేలు, సినిమా నటులతో డ్యాన్సులు, స్థానిక కళాకారులతో స్టెప్పులు, ఆటపాటలతో సందడి చేస్తారు. ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో కొన్ని సామాజికవర్గాలు రెండు వారాలుగా భారీస్థాయిలో వీటిని నిర్వహిస్తున్నాయి. కాకినాడలో ఓ కీలక సామాజికవర్గ పిక్నిక్‌లో ఆటపాటల్లో గెలిచినవారికి కారు, బైక్‌లు కూడా గిఫ్టులుగా అందిస్తున్నారు. మిమిక్రీ, కామెడీ పండించే కళాకారులను సైతం పిలిపిస్తున్నారు. కోనసీమ జిల్లాలో తోటల్లో నిర్వహిస్తోన్న పిక్నిక్‌ల్లో సరదాగా కార్డులతోపాటు ఉత్తుత్తి కోడిపందేలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పిక్నిక్‌ల సందడి హోరెత్తిస్తోంది. మరోపక్క కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, శంఖవరం మండలాలు, యానాం వద్ద గోదావరి అందాలు, ఏజెన్సీలో మారేడుమిల్లి, చింతూరు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో జలపాతాల వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు వాటర్‌ఫాల్స్ మరింత శోభాయమానంగా మారి పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.

హరితవనం.. కడియం





కడియం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మనం ఒకటి రెండు రకాలు పూలు చూస్తేనే ముచ్చట పడి పోతాం.. అటువంటిది వందలాది రకాల పూలమొక్కలు విరబూస్తూ ఓ చోట కనిపిస్తే ఆ సుందర దృశ్యం చూడతరమా.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో నర్సరీల పూలకొలువు. మండలంలో పది గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో 1100 నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ పూలు, పండ్లు, అర్నమెంటల్, ఔషధ, సెమిషేడ్, క్రీపర్, ఇండోర్, ఔట్‌డోర్, హేంగింగ్ వంటి రకాల మొక్కలు అనేకం ఉంటాయి. కార్మికుల శ్రమ సౌందర్యంతో విరజిల్లే మొక్కలు ఆకుపచ్చని విన్యాసం చేస్తూ పర్యాటకులకు ప్రణమిల్లుతాయి. ప్రకృతి ఒడిలో హరిత శోభగా గోదావరి నదిఒడ్డున వెలసిన కడియం పూలసీమలో ఈ కార్తీక వేళ సేదతీరి ఉసిరిచెట్టు కింద సహపంక్తి వన భోజనాలు చేయడానికి అనేక మంది ఇష్టపడతారు. కడియపులంక జాతీయ రహదారిని అనుకుని ఉంటుంది. రాజమహేంద్రవరం నుంచి 13 కి.మీ ప్రయాణం చేస్తే కడియం చేరుకోవచ్చు. రావులపాలెం మీదుగా అయితే 23 కి.మీ ఉంటుంది. నిరంతరం బస్, ఆటోలు ఉంటాయి.

ఆహా.. ఏమి రుచి..అనరా..

పిక్నిక్ అంటే విందు కీలకం. వెజ్, నాన్‌వెజ్ భోజనాల్లో రకరకాల కమ్మటి వంటలు వేడివేడిగా తినడం అదో ఆనందం. ఈ నేపథ్యంలో పిక్నిక్‌లకు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలలో కొన్ని హోటళ్లకు భారీ వెజ్, నాన్‌వెజ్ భోజనాల ఆర్డర్లు వస్తున్నాయి. కాకినాడలో ఓ ప్రముఖ వెజ్ హోటల్ ఆదివారం రోజైతే లగేజీ ఆటోల్లో తుని వరకు, ఆ చివరన యానాం వరకు పది నుంచి పదిహేను పిక్నిక్ గ్రూపులకు భోజనాలు అందిస్తున్నాయి. నాన్‌వెజ్ కేటరింగ్‌లకు సైతం గిరాకీ భారీగా ఉంది. రకరకాల నాన్‌వెజ్ వంటకాలు వండి పిక్నిక్ స్పాట్‌ల వద్దకు చేర వేయడం, పిక్నిక్ జరిగే ప్రదేశంలోనే భారీ వంటకాలు సైతం కొందరు చేయించుకుంటు న్నారు. కొందరైతే గోదావరి సమీపంలో పిక్నిక్‌లు చేసుకుంటూ లైవ్ ఫిష్ వండించుకుతింటున్నారు. దీంతో ఆదివారం వస్తే కేటరింగ్ సంస్థలకు భారీ ఆర్డర్లు వస్తున్నాయి. వెజ్‌లో పది రకాల ఐటమ్స్‌కు ప్లేటుకు రూ.250 నుంచి వసూలు చేస్తుండగా, నాన్‌వెజ్ అయితే రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. పిక్నిక్‌లో సుష్టిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ప్రకృతి చుట్టూ కాకినాడ

చుట్టూ అందాలు.. మధ్యలో కాకినాడ జిల్లా.. ఒకప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం ఇది.. ఒకవైపు చూపరులను కట్టపడేసే అందమైన ఏజెన్సీ.. మరోవైపు కాకినాడనే ఆనుకుని ఉన్న మడ అడవులు.. ఇంకోవైపు యానాం.. మరోవైపు పచ్చని కోనసీమ.. ఇక అందరినీ ఆకట్టుకునే కాకినాడ బీచ్.. ఇంతేనా అనుకోవద్దు.. ఏజెన్సీలో విహరిద్దామని అనుకుంటే ఒకటా రెండా ఏకంగా 8 జలపాతాలు ఉన్నాయి. అన్నీ జలకళతో పర్యాటకులను రారమ్మని పిలుస్తున్నాయి. మరోవైపు అందాల యానాం ఆస్వాదించేందుకు రమ్మంటుంది.. మడ అడవులను తిలకిస్తే ఆ ఆనందమే వేరు.. కాకినాడ జిల్లాకు ఎటు చూసినా అందమే మరి.. ఒకసారి ఆ అందాన్ని ఆస్వాదిద్దాం.. కాకినాడ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్ సౌకర్యం ఉంది. ఏజెన్సీలోని జలపాతాల వద్దకు వెళ్లాలంటే సొంత వాహనం లేదంటే అద్దెకు మాట్లాడుకుని అయినా వెళ్లాల్సిందే.


మహా పుష్కరవనం
రాజమహేంద్రవరం వద్ద దివాన్‌చెరువులోని పుష్కరవనం

లాలాచెరువు సమీపంలో జాతీయరహదారిని ఆనుకుని దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోదావరి మహా పుష్కరవనం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వనంలో వాకింగ్‌ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, హరితవనం, కార్తీకవనం, వెదురుచెట్లు, పిల్లలు ఆడుకునే పార్క్ వంటి సదుపాయాలు ఉన్నాయి. పుష్కరవనంలో ప్రత్యేకించి కార్తీకవనం కూడా ఉంది. ఇందులో దాదాపు 80 వరకూ ఉసిరి చెట్లు ఉంటాయి. ఈ పుష్కరవనంలో వనభోజనాలు చేయాలంటే పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.10 వంతున ప్రవేశరుసుంగా చెల్లించాలి.

ఐదో రోజూ నిల్

రేపటితో ముగుస్తున్న టీచర్ ఎమ్మెల్సీ నామినేషన్ల గడువు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్లు దాఖలు కాలేదు. ఇప్పటివరకు కేవలం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి. ఈనెల 18వ తేదీతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుంది.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మండల స్థాయిలో పిఠాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్‌హాల్ రథాలపేటలో సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ఆయన ప్రకటన విడుదల చేశారు. అలాగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు నిర్వహిస్తున్న ధర్నాలో మాట్లాడుతున్న శేషబాబ్జి

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ ఆదేశాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి కలెక్టర్ షాన్‌మోహన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశిస్తూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె ముగిసి నేటికి ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండ్‌నూ నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర అప్పులను కారణంగా చూపడం మానుకోవాలన్నారు. 300 కుటుంబాలకొక మినీసెంటర్ ఉండాల్సి ఉండగా, 1500 కుటుంబాలకు ఒక మినీ సెంటర్ నిర్వహిస్తూ మినీ వర్కర్లను బానిసలకంటే దారుణంగా పనిచేయిస్తున్నారన్నారు. మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సమ్మె ఒప్పందం అమలుకు దశలవారీ పోరా టాలకు అంగన్వాడీలు సిద్ధపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, చంద్రావతి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఘనుల'పై గురి

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్.. గనులశాఖ డీడీ కార్యాలయంలో దందాలపై కలెక్టర్ ఫైర్

కార్యాలయంలో జరుగుతోన్న బాగోతంపై జేసీతో విచారణకు ఆదేశాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయంలో అడ్డూ అదుపులేని దందాలపై కలెక్టర్ షాన్‌మోహన్ సీరియస్ అయ్యారు. కార్యాలయంలో దాదాపు 17ఏళ్లగా తిష్టవేసి ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తోన్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని బండారంపై ఆరా తీశారు. లీజుదారుల అక్రమాలకు సహకరిస్తూ వారు చెప్పినట్టల్లా ఆడుతోన్న సదరు ఉద్యోగినిపై విచారణకు ఆదేశించారు. డీడీ కార్యాలయం కేంద్రంగా జిల్లాలో క్వారీలు, గ్రావెల్ తవ్వకాల్లో అక్రమాలు, ఇతర ఉల్లంఘనలపై ఏమాత్రం చర్యలు లేకుండా మామూళ్లు పిండేస్తోన్న తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. ఈనేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో జేసీ విచారణ చేపట్టనున్నారు. జిల్లా గనుల శాఖ డీడీ కార్యాలయంలో కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తిష్టవేసి మైనింగ్ లీజుదారులకు కార్యాలయాన్ని అప్పగించేసి, ఆ ముసుగులో భారీగా సంపాదిస్తోన్న ఓ మహిళా ఉద్యోగినితోపాటు మరికొందరిపై "పెద్ద ఘనులే" అంటూ ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలతో శనివారం కథనం వెలువడింది. ఈనేపథ్యంలో దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ సీరియస్ అయ్యారు. డీడీ కార్యాలయంలో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, తాత్కాలిక పర్మిట్ల ముసుగులో కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నా వారికి కొమ్ముకాస్తోన్న వైనంపై కథనంలో రావడంతో కలెక్టర్ అసలు సంగతిపై ఆరా తీశారు. ప్రధానంగా పెద్దాపురం నియోజకవర్గం రామేశంమెట్టలో ఇచ్చిన తాత్కాలిక పర్మిట్లు, రౌతులపూడిలో పలు క్వారీల్లో అక్రమాలు జరుగుతున్నా సదరు ఉద్యోగిని లీజుదారులనుంచి భారీగా వసూళ్లు చేస్తూ పైఅధికారులకు సైతం జేబులు నింపుతున్న వైనంపై కథనంలో రావడంతో లోతుగా ఆరాతీసి సదరు బాధ్యులైన ఉద్యోగినిపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఈమేరకు జేసీ గనులశాఖ డీడీ కార్యాలయానికి వెళ్లి లోతుగా మరిన్ని వివరాలు సేకరించాలని సూచించారు. వాస్తవానికి డీడీ కార్యాలయం పనితీరుపై కలెక్టర్ కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్నారు. రామేశంమెట్టలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్ అధికారులు నోరెత్తకపోవడం, అక్రమ తవ్వకాలపై సర్వే చేసి దోపిడీని నిగ్గుతేల్చాలని ఆదేశిస్తున్నా డీడీ కార్యాలయంలో చలనం లేదు. మరోపక్క కొందరు లీజుదారులు ఏళ్ల తరబడి పాతుకుపోయిన సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని అడ్డంపెట్టుకుని తమకు నచ్చనివారిపై ఫైన్‌లు, తనిఖీలు చేయిస్తూ హల్ చేయిస్తున్న తీరుతో డీడీ కార్యాలయంపై అనేకమంది వ్యాపారులు సైతం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో మొత్తం అక్రమాల బాగోతం తేల్చే దిశగా జేసీతో విచారణకు ఆదేశించారు.

'31వేల క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు..'

సామర్లకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో శనివారం నాటికి 363 మంది రైతుల నుంచి 31 వేల 182 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు ఎం.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు కష్టం దళారుల పాలు' అనే పేరిట ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనంపై సివిల్ సప్లయ్ అధికారులు స్పందించారు. కాగా ఈ సీజన్లో గత నెల 22వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా 277 రైతుసేవా కేంద్రాల ద్వారా 363 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఇప్పటికి కేవలం 3,118 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. ఈ సీజన్లో 5 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ లక్ష్యాన్ని ఎప్పటికి చేరుతారో, తమ నుంచి జోరుగా ధాన్యాన్ని ఎప్పటికి కొనుగోలు చేస్తారోనని క్షేత్రస్థాయిలో రైతులు ఎదురుతెన్నులు చూడడమే కాకుండా వాతావరణ పరిస్థితుల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు వ్యయప్రయాసలకు రైతులు లోనవుతున్నారు. పంటకోతలు ప్రారంభించిన 15 రోజుల వరకూ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తమ వద్ద ధాన్యాన్ని భద్రపరుచుకోలేక అయినకాడికి ధాన్యాన్ని దళారీలకు అమ్ముకున్న విషయం వాస్తవమే అయినప్పటికీ దళారీలు లేరు అంటూ సివిల్ సప్లయ్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేసి చేతులుదులుపుకోవడమేనని పలువురు పేర్కొంటున్నారు.

రాక్షస దారులు!

నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

-6లో

'మెరుగైన ఉపాధికి సహకార సంస్థలు కృషి చేయాలి'

డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్ టీకే దుర్గాప్రసాద్

సర్పవరం జంక్షన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థ ద్వారా మెరుగైన జీవనోపాధి కల్పనతోపాటు నైపుణ్యాభివృద్ధి సాధన దిశగా సహకార సంస్థలు కృషిచేయాలని జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ కోరారు. సోమవారం కాకినాడలోని కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని 'ఉపాధి కల్పన- నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర' అనే అంశంపై కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకారరంగంలో కొనసాగుతోన్న ఎన్నో సంస్థలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. సహకార ఉద్యమస్ఫూర్తితో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని కోరారు. డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్ టీకే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సహకారరంగం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు, కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్‌లు సహకార వ్యవస్థ పాత్రపై వివరించారు. కార్యక్రమంలో కేసీబీఎస్ మేనేజర్ చీమలకొండ గంగాధరం, డీసీసీబీ జీఎం ప్రవీణ్‌కుమార్, ఎ.వెంకటేశ్వరరావు, ముమ్మిడి గోవిందు, ముత్తా మధు, వెంకటరమణ పాల్గొన్నారు.



నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

రాక్షస దారులు!



రోడ్డు ప్రమాదాల్లో బతుకులు ఛిద్రం.. కొంపముంచుతున్న అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారుల అతివేగం.. కునుకుపాటు

రోడ్డుపైకి వస్తే క్షేమంగా ఇంటికి చేరుతామన్న భరోసాపోయింది. ఏ క్షణం గుండె గుభేల్‌మనే దుర్వార్త వినాల్సి వస్తుందో అంచనా వేయలేని దుస్థితి దాపురించింది. రహదార్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో నిర్లక్ష్యం, అతి వేగం, కునుకుపాటు, రోడ్లపై గుంతలు, హెల్మెట్, సీటు బెల్టు ధరించడంలో ఏమరుపాటు.. ఇలా కారణాలేమైనా కుటుంబాలు మాత్రం ఛిద్రమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జీవితాల్లో తీరని శోకాన్ని క్షణకాలంలో తీసుకొచ్చేస్తున్నాయి. బ్లాక్ స్పాట్లలో కూడా కనీసం సదుపాయాలు తీసుకోలేని నిర్లిప్తతలో యంత్రాంగం ఉంటే.. ఇటు వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఏ లేను (వరుస)లో ఏ వాహనం, ఎంత వేగంతో వెళ్లే వాహనం వెళ్లాలో కూడా 99 శాతం మందికి అవగాహన లేదు. సూచికలున్నా పట్టదు. వెరసి నవంబరు మూడో ఆదివారం నిర్వహించే రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం రోజున రహదార్లకు బలైపోయిన వారిని స్మరించుకోవడం తప్ప పరిస్థితుల్లో మార్పు కనిపించదు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదమంటే ఒక వ్యక్తి మరణమో, లేదా కొందరు క్షతగాత్రులుగా మిగలడం కాదు.. ఏదైనా ప్రమాదంలో కుటుంబాలకు ఆధారమైన వారు చనిపోతే.. ఇక ఆ కుటుంబాలకు దిక్కులేకుండాపోతుంది. అప్పటిదాకా సంతోషంగా సాగిపోతున్న వారి జీవితాలు అల్లకల్లోలమైపోతాయి. పిల్లలు అనాథలైపోతారు. నిత్యం ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతుండగా, మరెంతో మంది తీవ్రంగా గాయపడి మంచానపడుతున్నారు. అప్పుడు కూడా ఆ కష్టాన్ని భరించాల్సింది వారి కుటుంబమే. ఇలా బాధిత కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయి. కొందరి నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం, అతి వేగం, రోడ్లు ఛిద్రమై ప్రమాదాలు జరుగుతున్నాయి. జరుగుతుంటే మరి కొన్ని ప్రమాదాలు రహదారులు ఛిద్రమై గోతులమయం కావడంతో జరుగుతున్నాయి. కారణమేదైనా మూల్యం మాత్రం బాధితులతోపాటు వారి కుటుంబాలు మోస్తున్నాయి.

● మృత్యు కేంద్రాలు.. బ్లాక్ స్పాట్స్

రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా జాతీయ రహదారుల్లోనే జరుగుతుంటాయి. దానికి కారణాలు అనేకం. ఇలా తరచు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తారు. చివరి మూడేళ్లలో రోడ్డులోని 500 మీటర్ల నిడివి (స్ట్రెచ్)లో ప్రమాదాలు జరిగి 5 మరణాలు లేదా 10 మరణాలు లేదా అదే సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తే అక్కడ పలు శాఖలకు చెందిన అధికారులు సర్వే చేసి బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తారు. దీంతో ఆ ప్రాంతంలో కచ్చితంగా రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సవ్యంగా సాగితే బ్లాక్ స్పాట్‌గా కేంద్రం రిజిస్టర్ చేస్తుంది. వెంటనే ఆ ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టడానికి రూ.25 లక్షలు విడుదల చేస్తుంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం కొంత జత చేయడం ద్వారా తక్షణ రక్షణ చర్యలు చేపట్టి సూచన, హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, క్యాట్‌ఐస్ (రిఫ్లెక్టింగ్ స్టడ్స్), థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్స్, స్పీడ్ బ్రేకర్లు, సరిపడా లైటింగ్, ముందు కొంత దూరంలో బ్లాక్ స్పాట్ ఉందని.. వేగం నియంత్రించుకొని జాగ్రత్తగా వెళ్లాలనే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

● ప్రమాదాలకు కారణాలివేనా..

బ్లాక్‌స్పాట్లు గుర్తించిన తర్వాత ప్రధానంగా ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్తు, ఆర్టీఏ, మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాల పాత్ర ఎక్కువగా ఉంటుంది. అవసరమైన విద్యుత్తు, రోడ్డు మార్కింగులు, బోర్డుల ఏర్పాటు ఆ శాఖల పనే. పోలీసులు ఆయాచోట్ల స్టాపర్ బోర్డులు వంటివి ఏర్పాటుచేయడం, సిబ్బందిని కాపలాగా ఉంచడం చేస్తారు. శాఖల మధ్య సమన్వయ లోపం, ఆయా శాఖలు చేయాల్సిన రక్షణ పనుల్లో తీవ్ర అలసత్వం వల్ల బ్లాక్ స్పాట్లు మరిన్ని ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. అలాగే.. వాహన చోదకుల మితిమీరినతనం కూడా ప్రాణాలు కోల్పోయేలా చేస్తోంది. అతివేగం, నిద్రమత్తు, వచ్చీరాని డ్రైవింగ్, మద్యం సేవించి నడపడం, మలుపుల్లో, ఏదైనా అకస్మాత్తుగా ఎదురైతే అదుపు చేసుకోలేకపోవడం, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్నా నిర్లక్ష్యం, వాహనాలు కండీషనల్‌లో లేకపోవడం, రాత్రి వేళల్లో హైవేపై వాహనాలు నిలిపినా భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడం వంటి కారణాలు ప్రజల ఊపిరిని ఆపేస్తున్నాయి.

● ఏం చెయ్యొచ్చు

జాతీయ రహదారులు లేదా రెండు లేన్లు, సింగిల్‌లేన్(వరుస) రోడ్లపై స్పీడుగా వెళ్లే, నింపాదిగా వెళ్లే, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు, కార్లు ఏవి ఏ లేనులో వెళ్లాలో ఇప్పటికీ అధికశాతం మంది వాహనదారులకు అవగాహన లేదు. దీనిపై విస్తృతంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. టోల్‌గేట్ల వద్ద ఫోన్ నంబరు తీసుకొని ఆయా వాహనదారులను అప్రమత్తం చేసేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణపై మెసేజ్‌లను పంపొచ్చు. హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించవచ్చు. అతి వేగంగా వెళ్లేవాళ్లకు కౌన్సెలింగ్, అవసరమైతే కేసులు నమోదు చేయాలి. రోడ్లపై ఇష్టానుసారం పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించవచ్చు. రోడ్ల పక్కన ప్రమాద నివారణ సూచన, హెచ్చరిక బోర్డులను విస్తృతంగా ఏర్పాటుచేయాలి. గతంలో రాత్రి 12 గంటల నుంచి వాహన డ్రైవర్లను పోలీసులు గమనించేవారు. 2గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య డ్రైవర్ల ముఖాన్ని నీటితో కడిగించడం చేయించేవారు. సిబ్బంది కొరత వేధిస్తున్న పోలీసు శాఖకు ఇలాంటివి వీలుపడడం లేదని తెలుస్తోంది.

'తూర్పు'లో పది నెలల్లో 243 మంది మృతి.. 626 మంది క్షతగాత్రులు

తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. జాతీయ రహదారుల పరిధి ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు రోడ్డు ప్రమాదాల కేసుల నమోదు, దర్యాప్తు, విచారణలు ప్రహసనంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలోని 595 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా ఏకంగా 243 మంది ప్రాణాలు బలైపోయాయి. 626 మంది ఆస్పత్రి పాలయ్యారు. రాజానగరం, బొమ్మూరు, దేవరాపల్లి, నల్లజర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ 10 నెలల్లో 110 మంది విగత జీవులయ్యారు. ఇంచుమించు జాతీయ రహదార్లతో రాష్ట్ర రహదారులు ప్రమాదాల్లో పోటీపడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోని మరణాలు కుటుంబ సభ్యులను నిర్జీవంగా చేస్తుంటే.. గాయాలపాలైన వాళ్లలో చాలామంది మంచానికి, వీల్‌ఛైర్లకు పరిమితమై జీవితమంతా నరకం చూస్తున్నారు.

2024 జనవరి నుంచి అక్టోబరు వరకు..

స్టేషన్	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
వన్‌టౌన్	17	4	18
త్రీటౌన్	52	9	65
ప్రకాశ్‌నగర్	17	5	20
టూటౌన్	20	5	20
ధవళేశ్వరం	36	7	37
కడియం	30	9	43
రాజానగరం	45	29	26
కోరుకొండ	27	12	23
గోకవరం	23	7	29
సీతానగరం	10	5	8
బొమ్మూరు	46	25	36
అనపర్తి	13	3	14
బిక్కవోలు	14	4	17
రంగంపేట	10	5	8
కొవ్వూరుటౌన్	46	15	68
కొవ్వూరురూరల్	17	10	28
చాగల్లు	13	02	16
తాళ్లపూడి	13	4	12
గోపాలపురం	17	8	19
దేవరపల్లి	33	34	28
నిడదవోలు	15	3	17
సమిశ్రగూడెం	17	08	18
ఉండ్రాజవరం	07	02	05
పెరవలి	20	06	21
నల్లజర్ల	37	22	30
మొత్తం	595	243	626

తాళ్లూరులో జరిగిన ప్రమాదం(ఫైల్)



డేంజర్..డేంజర్

మురారి-నీలాద్రిరావుపేట పరిధిలో ఎక్కువ ప్రమాదాలు

గండేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలో మురారి గ్రామం నుంచి నీలాద్రిరావుపేట గ్రామం వరకు సుమారు 19 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్లేపల్లి గ్రామ శివారులో కొన్నేళ్ల క్రితం పశ్చిమగోదావరికి చెందిన ఐదుగురు కళాకారులు మృతిచెందారు. ఇటీవల మురారి గ్రామ శివారులో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు అన్నాదమ్ములు మృతిచెందారు. అలాగే తెలంగాణకు చెందిన బావాబామ్మర్దులు ఇటీవల మృత్యువాతపడ్డారు.

ప్రమాదాలు జరిగే స్పాట్‌లు

మురారి నుంచి నీలాద్రిరావుపేట వరకు ఏడు గ్రామాలుండగా 15కి పైగా డివైడర్లు ఉన్నాయి. మురారి, మల్లేపల్లి, గండేపల్లి, జడ్.రాగంపేట, తాళ్లూరు డివైడర్ల వద్ద మలుపులు ఎక్కువగా ఉం డడంతో గ్రామస్తులు వాహనాలు గమనించకపోవడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో హైవేపై విద్యుత్ లైట్లు వెలగకపోవడం, దాబా రెస్టారెంట్ల వద్ద వాహనాలు నిలిపివేయడం, వర్షాకాలంలో గోతుల్లోకి నీరు చేరడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

గస్తీ ముమ్మరం చేశాం



రాత్రి వేళల్లో హైవేపై గస్తీ ముమ్మరం చేశాం. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టిస్తున్నాం. ● గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు

రోడ్డున పడ్డ కుటుంబాలు

ప్రత్తిపాడు,నవంబరు16(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 16 కిలోమీటర్ల పైబడి జాతీయ రహదారి విస్తరించింది. గత జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృత్యువాత పడ్డారు. 50 మంది గాయపడ్డారు. ముఖ్యంగా పాదాలమ్మ తల్లి గుడి వద్ద ముగ్గురు లారీ డ్రైవర్లపై రాజమండ్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దూసుకువెళ్లిన ఘటనలో ముగ్గురు డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే గుడి వద్ద పని చేసే వ్యక్తిని కూడా అదే బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. గోవిందపురం కొండ జంక్షన్, నరేంద్రగిరి జంక్షన్, చెక్‌పోస్టు సెంటర్, సుద్దగడ్డ బ్రిడ్జి, రాచపల్లి అడ్డురోడ్డు, ధర్మవరం బైపాస్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్ సెంటర్, నిడిగట్ల వంతెన సెంటర్లలో ఎందరో మృతిచెందారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

కాకినాడ జిల్లాలో పది నెలల్లో 235 మృతులు

కాకినాడ క్రైం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరి నెల నుంచి అక్టోబరు నెల వరకు జిల్లావ్యాప్తంగా 220 ఘోర ప్రమాదాలు చోటుచేసుకోగా 235 మంది మృత్యువాతపడ్డారు. వారిలో 204 మంది పురుషులుకాగా 31 మంది మహిళలు. అలాగే మరో 97 రోడ్డు ప్రమాదాల్లో 134 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. అలాగే 348 ప్రమాదాల్లో 656 మంది గాయాలపాలయ్యారు. గత ప్రభుత్వం ఛిద్రమైన రహదారుల పట్ల శ్రద్ధ వహించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పలు ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్దను రోడ్డు ప్రమాదాలు మింగేస్తుంటే ఆయా కుటుంబాలు రోడ్డునపడి తేరుకోలేకపోతున్నాయి. బాధిత కుటుంబాల ఆర్థిక స్థితి పూర్తిగా మారిపోయి దీనస్థితిలోకి వెళ్లిపోతున్నారు. అనేకమంది భార్యాభర్తలు చనిపోయి పిల్లలు అనాథలవుతున్నారు. ఈ ప్రమాద విషాదాలు ఆయా కుటుంబాలను జీవితాంతం వెంటాడుతున్నాయి. కాగా కాకినాడ జిల్లా పోలీసులు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న రహదారుల్లో 55 బ్లాక్‌స్పాట్లను గుర్తించి నిరంతర భద్రతను ఏర్పాటుచేశారు. అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



నిరాశ్రయులుగా.. మిగిలిపోయారు!

2024 జనవరి 30న తేటగుంట హైవే కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తేటగుంటకు చెందిన గొర్ల నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. రోజువారీ కూలీగా ఉన్న నాగేశ్వరరావుపై భార్య, ముగ్గురు పిల్లలు, ఆయన తల్లి ఆధారపడి జీవించేవారు. ప్రమాదంలో ఇంటి యజమాని మరణించడంతో కుటుంబ మొత్తం నిరాశ్రయులుగా మిగిలామని వారు చెప్పారు. బీమాగానీ, ఆర్థిక సాయంగానీ అందకపోవడంతో భార్య పాపారత్నం రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తోంది.

- తుని రూరల్/ఆంధ్రజ్యోతి



ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● 'తూర్పు'లో రోడ్డు.. ప్రమాదాలిలా..

రహదారి	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఎన్‌హెచ్ 216(ఏ)	55	28	49
ఎన్‌హెచ్ 16	120	62	140
ఎన్‌హెచ్ 516(ఈ)	39	17	36
365బీబీ	15	08	14
516డీ	13	07	14
స్టేట్ హైవేలు	212	65	227
ఇతర రోడ్లు	141	40	146
మొత్తం	595	243	626





ఎన్నెన్నో అందాలు...

1. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి నుంచి ధారపల్లి దారి మార్గంలో కనిపించిన ప్రకృతి సోయగం. 2. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధారపల్లి కొండల మధ్యలో నుంచి చూపరులను కనువిందు చేసిన జలపాతం.



పెద్దాపురం శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తజనం



శృంగారవల్లభ స్వామివారు

పెద్దాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,38,620, అన్నదాన విరాళాలు రూ.85,895, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం, కానుకల ద్వారా రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.28,665 వెరసి రూ.3,59,240 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్వామి వారిని సుమారు 8 వేల మందికి పైగా భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



స్ఫటిక లింగానికి పూజ చేస్తున్న మంత్రి సుభాష్



లింగానికి మొక్కుతున్న మంత్రి రామానాయుడు

స్ఫటికలింగానికి మంత్రుల పూజలు

పెరవలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులోనున్న శివాలయం వద్ద స్ఫటిక లింగాన్ని శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దర్శించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా స్ఫటికలింగ దర్శనాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులతో పాటు మంత్రులు సుభాష్, రామానాయుడు స్ఫటిక లింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు. సంవత్సరంలో మూడుసార్లు మాత్రమే దర్శనానికి అవకాశం ఉంటుందని మిగతా రోజుల్లో కోనేరులో ఈ శివలింగాన్ని ముంచి వేస్తామని ఆలయ అధికారి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరస్వామి

కుండలేశ్వరంలో ప్రత్యేక పూజలు

కాట్రేనికోన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో శనివారం స్వామి వారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలు చేసి గోదావరిమాతకు పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాశ్యకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో చెయ్యేరుకు చెందిన మంతెన మమ్మురాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 2000 మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, నంద్యాల వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ భద్రరావు, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనంద కుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, మీసాల బాల చంద్రరావు పాల్గొన్నారు.

భక్తులతో వాడపల్లి ఆలయం కిటకిట

● ప్రత్యేక అభిషేకాలు, పూజలు ● స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.41.53 లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తడంతో కిక్కిరిసింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను జరిపి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు జరిపి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే ఆర్.మత్స్యలింగం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒకరోజు ఆదాయం రూ.41.53 లక్షలు వచ్చినట్టు ఉప కమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి. పక్క చిత్రంలో స్వామివారి ఆలయంలో భక్తుల సందడి

అంతర్వేది ఆలయంలో భక్తుల సందడి

అంతర్వేది, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తడంతో సందడి నెలకొంది. స్వామివారి నిత్యాభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు పూజలు చేశారు. ఆలయం లోపల వేప చెట్టు చుట్టూ కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారికి ముడుపులు కట్టారు. అయ్యప్ప మాలధారులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని నిత్యాన్నదానంలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం: నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కొప్పిశెట్టి వెంకటరమణ, కుటుంబ సభ్యులు రూ.1,11,116 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి చేతులమీదుగా అందించినట్టు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది కిరణ్, గుత్తుల శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద దర్శనానికి బారులుతీరిన భక్తులు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో సాధారణ పరిపాలనాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీమోహన్

పాదగయలో ప్రిన్సిపల్ కార్యదర్శి పూజలు

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సాధారణ పరిపాలనాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీమోహన్ శనివారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. వాణీమోహన్‌కు ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ప్రసాదాలు, అమ్మవార్ల ఫోటోను అందజేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి జయసూర్య దంపతులు

భీమేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి పూజలు

సామర్లకోట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి నైనాల జయసూర్య సతీసమేతంగా శనివారం కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామభీమేశ్వరస్వామిని, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు జడ్జి జయసూర్య దంపతులకు ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా ఆలయం ఆవరణలో అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పండితులచే వేదాశీర్వచనం పొంది స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందుకున్నారు.

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ : డీఈవో

- కాకినాడలో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ అన్నారు. కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్19 హాకీపోటీలు ప్రారంభమయ్యాయి. సమాఖ్య జిల్లా కార్యదర్శి లంకా జార్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈనెల 16 నుంచి 18వరకు మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ఏరోజుకారోజు విజేతలను ప్రకటిస్తారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ, పరిశీలకుడు సెల్వపాండియన్, హాకీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.రవిరాజు, పీఈటీ సంఘ జిల్లా కార్యదర్శి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

బాలికల్లో గుంటూరు జట్టుపై 11పాయింట్ల తేడాతో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. నెల్లూరుపై అనంతపూర్(.0.5), గుంటూరుపై విజయనగరం(0.2), ప్రకాశంపై కర్నూలు (0.1), కర్నూలుపై అనంతపూర్ 0.9. పశ్చిమగోదావరిపై కృష్ణా 0.1, విజయనగరంపై తూర్పుగోదావరి0.11, శ్రీకాకుళంపై కడప 0.7, నెల్లూరుపై కర్నూలు 0.1, పశ్చిమగోదావరిపై విశాఖ0.1 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. బాలుర విభాగంలో శ్రీకాకుళంపై తూర్పుగోదావరి 0.5, విజయనగరంపై అనంతపురం 0.17, కర్నూలుపై కృష్ణా 0.2, శ్రీకాకుళంపై నెల్లూరు0.3, చిత్తూరుపై అనంతపురం 0.2, కృష్ణాపై విశాఖజట్టు 0.7 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.



రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో రమేష్



గౌరవ వందనం ఇస్తున్న క్రీడాకారులు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా?

- అసెంబ్లీ సమావేశాలే కారణమా?



మండపేట మండలం తాపేశ్వరం లాకులు

మండపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ విరామం తర్వాత సాగునీటి సంఘాలకు జరిగే ఎన్నికలు ఈనెల 23న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసినట్టు సమాచారం. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నీటిసంఘ ఎన్నికలు డిసెంబరు 8న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 990 మంది సభ్యులు సంఘాల్లో ఉంటారు. వీరంతా నీటిసంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14, ప్రాజెక్టు కమిటీ 1కి సంబంధించి ఈనెల 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని వాయిదా వేశారు. డిసెంబరు 8న నిర్వహిస్తారా లేక మరో సారి వాయిదాపడతాయనే విషయం ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ కానప్పటికీ ఎన్నికలు వాయిదా వేస్తున్నామన్న సమాచారం మాత్రం అధికారులకు చేరింది. దాంతో సాగునీటి సంఘాలు వాయిదా పడ్డాయని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను రద్దుచేయటంతో ఐదేళ్లపాటు సంఘాల ఊసు లేదు. పంటకాల్వల ఆధునికీకరణకు కాణిపైసా కూడా విదల్చలేదు. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి నీటి సంఘాలు తెరపైకి వచ్చాయి. గతంలో ఇక్కడ సంఘాల తరపున డీసీ, ప్రాజెక్టు కమిటీల తరపున పనిచేసిన వారే ఇపుడు తిరిగి సాగునీటి సంఘాల అధ్యక్ష పదవుల కోసం పోటీపడుతున్నారు. మొత్తంమీద సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ఏకగ్రీవంగా నీటిసంఘాలను తమ ఖాతాలో వేసుకోవాలని గట్టిప్రయత్నాలు చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు ఎపుడు జరుగుతాయని ఇరిగేష్ ఉన్నతాధికారిని ప్రశ్నించగా ఈనెల 23న జరగాల్సిన ఎన్నికలు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందుకు ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్టు తమకు సమాచారం అందిందని ఎపుడు ఎన్నికలు జరుగుతాయనేది స్పష్టమై ఆదేశాలు తమకు ఇంకా చేర లేదని ఆయన చెప్పారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

- వీధినపడ్డ ఇద్దరు ఆడపిల్లలు, భార్య



మట్టిలో కూరుకుపోయిన శ్రీనుబాబు,



శ్రీనుబాబు(ఫైల్)

రౌతులపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటుకబట్టీలో మట్టితొక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన సంఘటన రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామానికి చెందిన పబ్బిరెడ్డి శ్రీను బాబు (38) గ్రామశివారున గల విరవాడకు చెందిన దిబిడి కృష్ణార్జున్ ఉదయం 6గంటల సమయంలో ఇటుకబట్టీలో ట్రాక్టర్‌తో మట్టిని తొక్కుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడి మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. శ్రీనుబాబు కూలిపని చేసుకుంటూ ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భర్త మృతితో ఇద్దరు ఆడపిల్లలను తాను ఎలా పోషించాలంటూ భార్య రోదిస్తోంది. రౌతుల పూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జైలులో కలిశారు.. చోరీలు చేస్తున్నారు!

- సాగిపాడు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు
- రెండు వారాల్లో కేసు ఛేదించిన పోలీసులు
- 40 కాసులు బంగారం..

రూ.2.70 లక్షలు స్వాధీనం



సాగిపాడు చోరీ కేసులో అరెస్టు చేసిన వ్యక్తులతో పాటు 40 కాసుల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోపాలపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీసులు రెండు వారాల్లోనే చోరీ కేసును ఛేదించి ముగ్గురిని శనివారం అరెస్టుచేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడుకు చెందిన భమిడిపాటి శ్రీనివాస్ ఈనెల 2వ తేదీన ఊరెళ్లాడు. ఆ సమయంలో అతని భార్య శారద, అత్తగారు గరిమెళ్ళ సూర్యకాంతం ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు మాస్కు, ముసుగులు ధరించి ఒక్కసారిగా ఇంట్లో ప్రవేశించారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించగా దాడి చేశారు. అనంతరం 40 కాసుల బంగారం, రూ.2.70 లక్షలు నగదు పట్టుకుని పరారయ్యారు. ఈ మేరకు సమాచారం అందడంతో శ్రీనివాస్ ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఏడు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గోపాలపురం శివారు దుర్గమ్మగుడి వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించారు. ఎట్టకేలకు చోరీ కేసులో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం పాతకొండగూడెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్(పండు), షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్(జంగారెడ్డిగూడెం), గోపాలపురం మండల తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్కా కిషోర్ బాబులను శనివారం ఉదయం అరెస్టు చేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఇద్దరు అంతర జిల్లా నేరస్తులని.. గతంలో జైలుకు వెళ్లివచ్చారు. నక్కా సతీష్‌బాబు ఆయిల్ చోరీ కేసులో సెంట్రల్ జైలులో ఉన్నాడు. జైలులో ఏర్పడిన పరిచయంతో ముగ్గురు స్నేహితులుగా మారారు. అనుపానులు గమనించి చోరీలు చేయడం అలవాటుగా చేసుకున్నారు. గోపాలపురం ఘటనలో పోలీసులకు చిక్కారు. ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శనివారం కొవ్వూరు కోర్టుకు తరలించినట్టు దేవరపల్లి సీఐ పి.నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించినట్టు తెలిపారు.

అన్నవరం దేవస్థానం సిబ్బంది సమష్టి కృషితోనే

గిరిప్రదక్షిణ, పౌర్ణమి వేడుకలు విజయవంతం



ఈవో రామచంద్రమోహన్‌ను అభినందిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

అన్నవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు, సుమారు రెండు లక్షల మంది భక్తులు పాల్గొన్న గిరిప్రదక్షణ కార్యక్రమం సిబ్బంది సమిష్టికృషితోనే విజయవంతమైందని ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కార్యక్రమం విజయవంతం కావడంతో ఆయనను అభినందించగా ఈవోపై వ్యాఖ్యలు చేశారు. తాను గతేడాది అనుభవాలు దృష్ట్యా మార్పులు మాత్రమే చేశానని ప్రతిఒక్క ఉద్యోగి శ్రమించారని అన్నారు. మున్ముందు ఇదే ఐక్యతతో పనిచేయాలని సూచించారు. ఈవోకు వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సి.హెచ్.రామ్మోహనరావు, ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి.రామారావు, అనకాపల్లి ప్రసాద్, కంచి మూర్తి, కంచిభట్ల రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ లెక్కల రమేష్ తదితరులు ఉన్నారు.

'పసుపు పీతలు సాగుకు అనుకూలం'



స్థలాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్

కాట్రేనికోన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిర్రయానాంలో పసుపు పీతల హేచరీకి కేటాయించిన ఐదెకరాల భూమిని శనివారం మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ తమిళనాడు హేచరీ నుంచి పీత ఒక్కంటికి రూ.12కు కొని, మూడు రూపాయలు రవాణా ఛార్జీ చెల్లిస్తున్నామన్నారు. 1300కి.మీ ప్రయాణం కారణంగా 50శాతం పిల్లలు చనిపోతున్నాయన్నారు. స్థానికంగా పసుపు పీతల పిల్లలను ఉత్పత్తి చేస్తే పీతల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇది మొదటి ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవో చొరవ తీసుకుని కేవలం 15రోజుల్లో హేచరీకి భూమిని కేటాయించడం ఆనందదాయకమన్నారు. రూ.2.75 కోట్ల అంచనాతో ప్రాజెక్టును ప్రతిపాదించడం సంతోషంగా ఉందన్నారు. కమిషనర్ డోలాశంకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో నాలుగు నెలల్లో హేచరీని నెలకొల్పుతామన్నారు. ఇక్కడి వాతావరణం పీతల సాగుకు అనుకూలంగా ఉందని ఆయన అన్నారు. యునైటెడ్ నేషన్స్ అభివృద్ధి ప్రోగ్రాం ప్రతినిధి సుదీప్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.శ్రీనివాస్, మత్స్యశాఖ సహాయసంచాలకుడు ఎల్పీఎస్ వర్ధన్, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, గ్రామ మత్స్యశాఖ సహాయకులు లోవరాజు, బాలయోగి, మీనాకుమారి, రవికిరణ్ పాల్గొన్నారు

పుష్కరాలు-2027కి ప్రత్యేక కమిటీలు

- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ముందస్తు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం సమీక్షించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని, అందుకు అనుగుణంగా నియమించిన కమిటీలన్నీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆయా శాఖలవారీ చేపట్టే పనుల ప్రాధాన్యతానుసారం ఒక్కొక్క కమిటీని నియమిస్తున్నామన్నారు. ట్రాఫిక్, హెల్త్ అండ్ శానిటేషన్, ఫుడ్‌కమిటీ, సర్వేలెన్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, పుష్కరనగర్ కమిటీ, డిజాస్టర్ కమిటీ, ప్రొటోకాల్, ఎగ్జిబిషన్, చైల్డ్ అండ్ లేబర్ కమిటీ, టెలికమ్యూనికేషన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో మున్సిపల్ అధికారులు, రూరల్ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అంశాలపై కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్డీవోలు ప్రజంటేషన్లు సిద్ధం చేయాలన్నారు. గత పుష్కరాల కంటే 2027 నాటి పుష్కరాలకు ప్రత్యేక బస్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆయా అధికారిక కమిటీలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్వో సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు, టీటీవో ఆర్.సురేష్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో కెఎల్.జ్యోతి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు పాల్గొన్నారు.

గాలి నాణ్యతను పెంపొందించేందుకు చర్యలు

వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ పరిశీలించిన కమిషనర్



వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా గాలి నాణ్యతను పెంచడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఎన్క్యాప్ నిధులతో కొనుగోలుచేసిన వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా మంచినీటిని గాలిలోకి చల్లడం ద్వారా గాలిలోని కాలుష్యాన్ని తగ్గించవచ్చని, దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయన్నారు. వాహనంపై స్ప్రే చేసే మిషన్ ఏర్పాటు చేశామని, దాని ద్వారా నీటిని చల్లుతామని నిరంతరాయంగా రెండుగంటలు పని చేస్తుందన్నారు. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లాలని అందుకోసం నెలకు పరిపడా షెడ్యూల్ తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ వాహనం మీద పనిచేయడానికి వీలుగా డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఐ.పాండురంగారావు, జీపీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో సంప్రదాయబద్ధంగా జ్వాలాతోరణం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు



సామర్లకోట భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం పూజలు చేస్తున్న భక్తులు

ద్రాక్షారామ, నవంబరు16(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శనివారం జ్వాలాతోరణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృత్తిక నక్షత్రం రోజున స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి సర్వదేవాతా ఆహ్వానం, దూపసేవ నిర్వహించారు. అనంతరం ప్రదోషకాల పూజ జరిపారు. నేతి జ్యోతికాంతిలో ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణం చేశారు. సప్తగోదావరి తీరంలో జ్వాలాతోరణం నిర్వహించారు. మంత్రి సుభాష్ సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని జ్వాలాతోరణం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ సుబ్బారావు, ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: శనివారంరాత్రి కుమారరామ భీమేశ్వరాలయం ఎదుట జ్వాలాతోరణ పూజలు వందలాది భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజశేఖరశర్మ, వెంకన్న తదితరులచే ముందుగా వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి,అమ్మవార్ల దేవతామూర్తులను ప్రత్యేక సర్వవాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించి రాత్రికి ఆలయానికి తోడ్కొని రాగా అప్పటికే వేచి ఉన్న భక్తులు శివనామ స్మరణల మధ్య పండితులు జ్వాలాతోరణాన్ని జ్వలింపజేశారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సాయిబాబు

ముమ్మిడివరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించిన వ్యక్తికి ఆ సొమ్ము తీసుకున్న వ్యక్తి సరైన సంజాయిషీ చెప్పకపోవడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ తిల్లమ్మ చెరువుకాలనీకి చెందిన మెల్లం సాయిబాబు(33) రాణేలంకకు చెందిన అతడి స్నేహితుడికి రూ.15 లక్షలు అప్పుగా ఇప్పించాడు. ఆ అప్పుకు సంబంధించి సాయిబాబు ష్యూరిటీగా ఉన్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని సాయిబాబు అతని స్నేహితుడిని పదేపదే అడిగినా తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పదిరోజులుగా తీవ్ర మనస్తాపానికి గురై 14వ తేదీ రాత్రి అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటివద్ద కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోరింగలో న్యాయ విద్యార్థుల సందర్శన

తాళ్లరేవు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోరింగ అభయారణ్యంలో ప్రకృతి అందాలను కాకానాడ పీఎస్ రాజు లా కళశాల న్యాయ విద్యార్థులు శనివారం సందర్శించారు. రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో అభయారణ్యంలో ప్రాముఖ్యత, మడ అడవులపై ఫారెస్ట్ సిబ్బంది తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులు మహేష్, సంధ్యారాణి, సిద్దార్ధ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఆక్రమణలు తొలగించని యంత్రాంగం



ఉప్పాడలో వీవర్స్ కాలనీ సమీపంలో తొలగించని బడ్డీ దుకాణాలు

కొత్తపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ-పిఠాపురం ఆర్అండ్‌బీ రహదారిలో ఆక్రమణలు తొలగించాలన్న కలెక్టర్ ఆదేశాలను స్థానిక యంత్రాంగం బేఖాతర్ చేసిన సంఘటన ఉప్పాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే ఉప్పాడ నుంచి పిఠాపురం వెళ్లే రోడ్డులో సినిమా థియేటర్ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు ఆనుకుని బడ్డీలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణదారులు సంబంధిత అధికారులను ప్రాధేయపడగా 2,3 రోజులు గడువు అడిగారని, గడువు తీరినా ఇంకా ఆక్రమణలు తొలగించకపోవడంతో స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ వ్యవహారం కొత్తపల్లి విచ్చేసిన డీపీవో వి రవికుమార్‌ను దృష్టికి వెళ్లడంతో విచారణ చేసి త్వరలో ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు.

4న విజయవాడలో ప్రజా హక్కుల సభ

కాకినాడ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 4న విజయవాడలో నిర్వహించనున్న ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు లిబరేషన్ పార్టీ కార్యకర్తలు, ఐద్వా సభ్యులు శనివారం స్థానిక కొండయ్యపాలెం, భానుగుడి ఏరియాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఆకాశన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఉచిత ఇసుక సరఫరా సక్రమంగా అమలు చేయాలని, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులకు రేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొడుగు సత్యనారాయణ, నాయకులు శీలం అప్పలరాజు, పినరసరాజు, సోనీ, బిందు రాజేష్, రాజేశ్వరి, రాజు తదితరులు ఉన్నారు.

'భోజనం నాణ్యత పెంచాలి'

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలోని పదార్థాల నాణ్యతను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం పరిశీలించారు. భోజనం సరిగా ఉండకపోవడంతో విద్యార్థులు పాఠశాలలో తినేందుకు ఆసక్తి చూపడంలేదని తెలిపారు. పథకానికి ఇచ్చే నిధులను పెంచాలని వారు కోరారు.

'భూములను అప్పగించాలి'

తాళ్లరేవు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం సర్వేనెం.622/8ఏ1లో డి పట్టా భూములను తిరిగి అప్పగించాలని బాధితులు తహశీల్దార్ పి.త్రినాధరావుకు శనివారం ఫిర్యాదు చేశారు. బాధితులు దడాల అనంతలక్ష్మి, దున్నా సుబ్బలక్ష్మి మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం ల్యాండ్‌సీలింగ్ భూములను 30 సెంట్లు చొప్పున పేదలకు పంచి డిపట్టాలు, పాస్ పుస్తకాను అందజేసిందన్నారు. కొందరు దళారులు ఈ భూములను అన్యా క్రాంతం చేశారని, వారి నుంచి స్వాధీనం చేసుకుని ప్రభుత్వం మాకు స్వాధీనం చేయాలని వారు కోరారు.

చీమలమందు తాగి ఇద్దరు మైనర్లు ఆత్మహత్యాయత్నం

పెద్దాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మైనర్లు చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. స్థానిక బంగారమ్మ గుడి వీధికి చెందిన ఓ మైనర్ బాలిక, వాలుతిమ్మాపురం టిడ్కో గృహసముదాయంలో నివసిస్తున్న ఓ మైనర్ బాలుడు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలు వారి ప్రేమను నిరాకరించడంతో ఇద్దరు కలిసి చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిద్దరినీ స్థానిక సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విలీన గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలి

అసెంబ్లీలో కోరిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అధ్యక్షా...మొదటిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నాకు అసెంబ్లీలో మాట్లాడేందుకు తొలి అవకాశం ఇచ్చినందుకు ధన్యావాదాలు అంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) రూరల్లో విలీన గ్రామ పంచాయతీల పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలుగెత్తారు. గత 13 ఏళ్లుగా ఎన్నికలు జరుగని కాకినాడ రూరల్ మండల పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీలకు ప్రతీ ఏటా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు రాక, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతుందని, స్థానిక సంస్థలతో పాటూ వీటికి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఏటా సుమారు 5 కోట్ల మేర కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు రావడం లేదన్నారు. స్టాంప్ డ్యూటీ నిధుల సైతం సక్రమంగా విడుదల కాకపోవడంతో మేజర్ గ్రామపంచాయతీలైన ఈ ఆరు పంచాయతీల్లో పరిపాలన సక్రమంగా లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. పంచాయతీల ద్వారా వచ్చే నిధులతో శానిటేషన్ నిర్వహణ, పంచాయతీ సిబ్బంది జీతభత్యాలకే సరిపోతున్నాయన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఉన్న ఓటర్లలో సగం మంది ఓటర్లు సుమారు 1.25 లక్షల ఓటర్లు రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, చీడిగ, ఇంద్రపాలెం, తూరంగి పంచాయతీల్లో ఉన్నారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థలో రూరల్ పరిధిలో 8 పంచాయతీలను విలీనం చేస్తూ 2013లో రాష్ట్ర ప్రభుత్వం 175 జీవో విడుదల చేసిందన్నారు. ఇందులో స్వామినగర్, ఎస్.అచ్చుతాపురం మినహాయించి, మిగిలిన ఆరు గ్రామ పంచాయతీ పాలకవర్గాలు విలీనాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్లి 2015లో ప్రభుత్వ జీవోను నిలుపుదలచేస్తూ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడం జరిగిందన్నారు. ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి ఆయా ప్రజాప్రతినిధులు చేసిన తీర్మానాల ప్రకారం నగరపాలక సంస్థలో విలీనం చేయాలా వద్దా అనేది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పు అనుసరించి ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో విలీనానికి అనుకూలంగా చేసిన తీర్మానాలు చెల్లవని, అందుచేత నగర పాలకసంస్థలో ఆయా పంచాయతీలు విలీనం చేసే అవకాశం లేనందున వీటికి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల లేఖ రాయడంజరిగిందని అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ 6 గ్రామాలకు స్థానిక సంస్థలతోపాటూ ఎన్నికలైనా నిర్వహించాలని, లేదంటే నగరపాలక సంస్థలో విలీనం చేయాలని కోరారు. విలీన గ్రామాల కోసం అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నానాజీని విలీన గ్రామాల మాజీ సర్పంచ్‌లు అడబాల రత్నప్రసాదరావు, పితాని అప్పన్న, పలివెల వీరబాబుల అభినందించారు.



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి : రాజప్ప

సామర్లకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పట్టణంలో ఉన్న ప్రస్తుతం ఉన్న యాభై పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, కొవిడ్ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన వెంటిలేటర్లు వినియోగంలో లేనందున సత్వరం వాటిని వినియోగంలోకి తీసుకురావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో రాజప్ప పెద్దాపురం నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు నిర్మించిన టిడ్కో గృహాలను పేదలైన లబ్ధిదారులకు అప్పగించకుండా గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసినందున సత్వరం ప్రభుత్వం దృష్టి సారించి అర్హులైన లబ్దిదారులకు ప్లాట్‌లను అప్పగించాలన్నారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ప్లాట్‌ల లబ్దిదారులకు రుణాలు చెల్లించాలని బ్యాంకులు నోటీసులు జారీ చేస్తున్నందున వడ్డీ మాఫీ అయినా చేసేలా ప్రభుత్వం బ్యాంకర్లతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే రాజప్ప స్పీకర్‌ని కోరారు. అసంపూర్తిగా ఉన్న రెండవదశ ప్లాట్‌ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆయన కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే రాజప్ప

'మూర్ఛ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి'

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదడులో ఏర్పడే చిన్న చిన్న కణితిలు లేదా లోపాల వల్ల వచ్చే మూర్ఛ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్ లావణ్యకుమారి సూచించారు. జాతీయ మూర్ఛవ్యాధి దినం సందర్భంగా శనివారం ఆసుపత్రి న్యూరో మెడిసిన్ ఓపీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లావణ్యకుమారి, ఆర్థో హెచ్‌వోడి డా.ఎంపీఆర్ విఠల్ పాల్గొన్నారు. లావణ్యకుమారి మాట్లాడుతూ మెదడులో లోపాల వల్ల మనిషికి తెలియకుండా వచ్చే అసాధారణమైన స్థితి మూర్ఛ అని, ఇది నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదకరంగా మారుతుందన్నారు. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఎపిలప్సి (మూర్ఛవ్యాధి) ఓపి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మూర్ఛవ్యాధి బాధితుల కోసం ప్రతీ శనివారం న్యూరోమెడిసిన్ వైద్య నిపుణులు ఈ ఓపిని నిర్వహిస్తారన్నారు. 3 నెంబరు ఓపిలో పరీక్ష చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.శశి, న్యూరోమెడిసిన్ వైద్య నిపుణులు డా.షరీఫ్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు డా.పాశం సతీష్ శ్రీనివాస్, ఎన్‌టీఆర్ హెల్త్ యూనీవర్సిటీ విశ్రాంత వీసీ డా. కె.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లావణ్యకుమారి

డీపీవో పరిశీలన



వాకతిప్ప ఎండీపేట సమీపంలో చెత్త డంపింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీపీవో

కొత్తపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాకతిప్ప పీహెచ్‌సీకి దూరంగా చెత్తను తరలించాలన్న డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో డీపీవో వీ.రవికుమార్ శనివారం వాకతిప్పలో ఎండీపేట సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల పీహెచ్‌లో అవుట్ పేషెంట్ బ్లాక్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయడం విదితమే. దీనిలో భాగంగా సర్పంచ్ పాలాని దొరబాబు, జనసేన నాయకుడు రావు అక్షయ్ సూచనల మేరకు బావయ్య చెరువు గట్టుకు ఆనుకుని ఎండీపేట సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశం చెత్త తరలించేందుకు అనుకూలంగా ఉంటుందని డీపీవో గుర్తించారు. కాకపోతే చెరువు గట్టును ట్రాక్టర్ లోపలకు వెళ్లేందుకు వెడల్పు చేయాల్సి ఉంటుందన్నారు. ఉపసర్పంచ్ మామిడి మల్లిబాబు, తహశీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో పి.రవి కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అందుబాటులోకి మొబైల్ టాయిలెట్లు

పిఠాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం తన సొంత ట్రస్టు వీకే ట్రస్టు ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన మొబైల్ టాయిలెట్లును శనివారం నుంచి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పాదగయకు 20 టాయిలెట్లు పవన్ సమకూర్చిన సంగతి తెలిసిందే. ఇందులో పది వంతున టాయిలెట్లును పురుషులు, మహిళలకు కేటాయించి, నీటి సదుపాయాన్ని కల్పించినట్టు ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సర్పవరం జంక్షన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాకలపూడిలో ఉమామనో వికాస కేంద్రం మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల్లో సోమవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలను జీజీహెచ్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వి.వరప్రసాద్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రోజా, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎస్‌ఏ వికాసినిల ఆధ్వర్యంలో 64 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్ఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, డాక్టర్ జీ హేమవినీల రత్నం, బి. సుధాకర్ రెడ్డి, ఉమా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.నారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ ఉమారెడ్డి, ప్రత్యేక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెకుముకి పోటీలు

సామర్లకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు పురస్కరించుకుని ఆదివారం సామర్లకోట మండలం ఉండూరు ఎంపీపీ పాఠశాల నందు విద్యార్థులకు 3 కేటగిరిల్లో పోటీలు నిర్వహించనున్నట్టు జేవీవీ జిల్లా నాయకులు ప్రసాద్, శ్రీరామారావు తెలిపారు. ఇప్పటికే పాఠశాలల స్థాయిలోను, మండలస్థాయిలో పోటీలు పూర్తయ్యినందున వాటిలో విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలను ఉండూరులో నిర్వహిస్తున్నామన్నారు. వివిధ మండలాల నుంచి 45 టీంలకు చెంది 90 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు ప్రముఖుల చేతులమీదుగా అందజేయనున్నట్టు తెలిపారు.

బస్సులకు టెస్ట్ రైడ్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపోలో బస్సు ప్రతీ 20 వేల కిలోమీటర్లు తిరిగిన తర్వాత ఒక రోజు పూర్తిగా అన్ని విభాగాలను తనిఖీ చేసి ఏమైనా యాంత్రిక లోపాలుంటే సరిచేసిన తర్వాత ఆబస్సు స్థితిని తెలుసుకోవడం కోసం ప్రతీ బస్సుకు టెస్ట్ రైడ్ నిర్వహిస్తున్నారు. బస్సు పూర్తి కండీషన్ తెలుసుకుని తదుపరి రోజు సర్వీస్‌కు పంపడం జరుగుతుంది. ఈ రైడ్‌లో డిపో మేనేజర్, మెకానికల్ సూపర్‌వైజర్, మెకానికల్ సిబ్బంది, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఉంటారు.

సంగీత గాత్ర కచేరీ

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన సంగీత గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ జయంతిని పురస్కరించుకుని, వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో, సంగమేశ్వర సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో గుత్తుల అరుణ గాత్రకచేరీ వీనులవిందుగా సాగింది. కాంబోజీ రాగంలో లంబోదర మవలంటే కీర్తనతో ప్రారంభించి మధ్యమావతి రాగంలో వెంకటేశ ముఖ్యమైన అంశంగా తీసుకుని పూర్ణచంద్రిక రాగంలో తెలిసి రామచింతనతో తదితర కీర్తనలు గానం చేశారు. వీరికి వయొలిన్‌పై హెచ్.రాంచరణ్ (విజయనగరం), మృదంగంపై ఎం.ఏడుకొండలు సహకారం అందించారు.

రేబిస్‌తో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తూరంగి బుల్లబ్బాయి రెడ్డి నగర్‌కు చెందిన ఐనవిల్లి దుర్గాప్రసాద్ (28) రేబిస్‌తో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. 3నెలల క్రితం కుక్కకాటుకు గరయ్యాడని కేవలం ఒక ఇంజక్షన్ మాత్రమే చేయించుకుని కోర్స్ పూర్తిగా వాడకుండా నిర్లక్ష్యం చేశాడన్నారు. దీంతో అతడికి శనివారం ఆరోగ్యం క్షీణించడంతో కాకినాడ జీజీహెచ్‌లో 4గంటలకు చికిత్స నిమిత్తం చేరగా రేబిస్ సోకినట్టు వైద్యులు నిర్ధారించారని రాత్రి చనిపోయినట్టు తెలిపారు. దీంతో ఎస్ఐ సూర్యకుమార్ కేసు నమోదు చేశారు.

నాసిరకం విత్తనాలతోనే పంటలకు నష్టం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



దుర్గాడలో పత్తి పంటను పరిశీలిస్తున్న వర్మ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాల కారణంగానే పత్తి, మిరప పంటలకు నష్టం జరిగిందని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో దెబ్బతిన్న పత్తి, మిర్చి పంటలను ఆయన శనివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పిండినల్లి, వైరస్ సోకడంతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నదని, నాసిరకం విత్తనాలతో మిర్చి పంటకు నష్టం జరిగిందని తెలిపారు. సుమారు 700 ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలను రైతులు నష్టపోయారని, పత్తి కాయ పగలడం లేదని, పగిలినా పత్తి రావడంలేదని తెలిపారు. మిర్చి పంట రంగు మారిపోతున్నట్టు చెప్పారు. అధికారులను పంపి పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి వారికి పరిహారం అందించాలని, పంటలు వేసుకునేందుకు విత్తనాలు అందించాలని కలెక్టరును కోరినట్లు వర్మ తెలిపారు. అంతకు ముందు దుర్గాడ శివాలయంలో వర్మ పూజలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, తూము బాబు, మడికి ప్రసాద్, పెనుగొండ లక్ష్మీపతి, జేతా సత్యనారాయణ, మల్లిపూడి వీరబాబు పాల్గొన్నారు.

పనిచేసిన వారికి గుర్తింపు

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పిఠాపురం మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు టీడీపీ కార్యాలయంలో శనివారం వర్మను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అప్పారావును వర్మ, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


సామర్లకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇప్పటికే పెరిగిన కుటుంబసభ్యులతో అద్దె ఇళ్లల్లో కిక్కిరిసి నివసిస్తున్నందున ప్రభుత్వం సత్వరం స్పందించాలని ఏపీ రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం సామర్లకోట పట్టణ పరిధిలో అమ్మాణమ్మ నాయుడు కాలనీ వద్ద అఖిల భారత కార్మిక సంఘాలు, తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భూమి కోసం భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం విప్లవోద్యమంలో అశువులు బాసిన అమలరవీరులను స్మరిస్తూ అమలరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, కడితి సతీష్, మడికి సత్యం, డినారాయణ, బొచ్చ యేసు, దేశెట్టి సురేష్,వీరన్న పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న వీరాంజనేయుల

'దాడులకు బాధ్యులను కఠినంగా శిక్షించాలి'

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలపై గతంలో జరిగిన దాడులకు బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రాంత గ్రామీణ వికాస్ ప్రముఖ్ తిరుపతయ్య డిమాండ్ చేశారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం కరపత్రాలను హిందూ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. హైందవ శంఖారావానికి హిందువులంతా భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు గోవిందు, వెంకటేశ్వరరావు, సత్యరామచంద్రరావు, ఎస్ఎస్ఎఫ్, బీకేఎస్, బీజేపీ ప్రతినిధులున్నారు.



హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు సత్కారం

తాళ్లరేవు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రభుత్వ విప్‌గా ఎన్నికైన సందర్భంగా తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన ఘన సత్కారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వవిప్‌గా ఎంపిక చేయడం చాలా గర్వంగా ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు దుశ్శాలువాలు, పూలదండలతో దాట్లను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, మందాల గంగసూర్యనారాయణ, మోపూరి వెంకటేశ్వరరావు, టిల్లపూడి నాగేశ్వరరావు, రేళ్ల శ్రీనివాస చక్రవర్తి, గంజా సూరిబాబు,పెసింగి ఈశ్వరరావు ఉన్నారు.



తాళ్లరేవులో ఎమ్మెల్యే దాట్లతో నాయకులు

వంతెన నిర్మాణానికి రూ.3కోట్లు

ఇంజరం వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం శిథిలావ్యవస్థకు చేరుకున్న వంతెన నిర్మాణం చేపట్టకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వంతెన నిర్మాణ పనుల ప్రతిపాదనలు టీడీపీ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా రూ.3కోట్లు మంజూరు చేశారని త్వరలో వంతెన నిర్మాణ పనులు టెండర్లద్వారా చేపడతామన్నారు. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చేలా వంతెన నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని అందువల్ల మత్స్యకారులకు ఓఎన్‌జీసీ నష్టపరిహారం డిసెంబరులో పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు వేగేశ్న భాస్కరరాజు, వుంగరాల వెంకటేశ్వరరావు, యేరుపల్లి వీరన్న, బజన సత్తిబాబు, సూరంపూడి కుమార్, బండారు దొరబాబు,అత్తిలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు



పెద్దాపురంలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

పెద్దాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు హాజరై మాట్లాడారు. ముందుగా గ్రంథాలయ ఉద్యకారులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ, సిబ్బంది బుల్లియ్య తదితరులున్నారు.

కరప: ఎందరో మహానుభావుల ఉద్యమ ఫలితంగా గ్రంథాలయాలు ఏర్పడ్డాయని వేళంగి శాఖా గ్రంథాలయాధికారి పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా వేళంగి శాఖా గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాలకృష్ణ, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాధన్, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి ప్రముఖుల ఉద్యమాల ఫలితంగా గ్రంథాలయాల ఏర్పాటు జరిగిందన్నారు. అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై వ్యాసరచన పోటీలు, బాలల హక్కులపై డిబేట్ నిర్వహించారు. వేళంగి గ్రాడ్యుయేట్స్‌యూత్ సభ్యుడు ఎర్రా విక్రమ్, సత్యానందం, ఎం.రామతులసి పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట ఉప గ్రంథాలయంలో వివిధపాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్ కేటగిరిలో పుస్తకపఠనం ఆవశ్యకత, సీనియర్స్ కేటగిరిలో సెల్‌ఫోన్ వినియోగం దుష్ఫలితాలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బందిల రత్నమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాతలు ఎమ్మెస్సార్ వెంకటరమణ ఆధ్యాత్మిక పుస్తకాలను అందజేసారు. టివి. సత్యనారాయణ, తులసి రాంబాబు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఉప్పాడ శాఖా గ్రంథాలయ అధికారి తెలగంశెట్టి నళినీప్రియ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. అనంతరం పుస్తకప్రదర్శనలో పలువురు విద్యార్థులు, స్థానిక ఆరోగ్యకార్యకర్త దాసరి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు ఉన్నారు.

పిఠాపురం: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థిని, విద్యార్థులకు దేశభక్త గేయాలు, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఎంఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సంగీత ఉపాధ్యాయురాలు జి.శేషకుమారి, ఉపాధ్యాయులు వి.సత్యప్రియ, కె.శ్యామల, గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము తదితరులున్నారు.



కరప: వేళంగిలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

'సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం'

కరప, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ట్రస్ట్ ఆఫ్ బొండా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆల్ ఇండియా అనస్థీషియన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డీఎస్ఎస్‌సీ చక్రరావు, రాజమహేంద్రవరం స్వర్ణాంధ్ర సేవాసమితి అధ్యక్షుడు గుబ్బల రాంబాబు కొనియాడారు. వేళంగి శ్రీనివాస నర్సింగ్ హోమ్ ఆవరణలో శనివారం ట్రస్ట్ ఆఫ్ బొండా 18వ అర్ధ సంవత్సర సమావేశంలో వారు మాట్లాడుతూ ట్రస్ట్ చేపడుతున్న సేవాకార్యక్రమాలను సభికులకు వివరించారు. అనంతరం ట్రస్ట్ ఆఫ్ బొండా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొండా వెంకన్నరావు మాట్లాడుతూ ఈ అర్ధసంవత్సర కాలంలో ట్రస్ట్ ద్వారా కాకినాడ దయా ఫౌండేషన్ భవన నిర్మాణానికి రూ.10వేలు, కూరాడలో నిరుపేద కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయమందించామన్నారు. ట్రస్ట్ ఆఫ్ బొండా సమకూర్చిన దుప్పట్లను వృద్ధులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆఫ్ బొండా సభ్యులు బొండా వీరవెంకటసత్యనారాయణమూర్తి, లక్ష్మి, డాక్టర్ బొండా సూర్యారావు, అనిత, డాక్టర్ బొండా రాజ్‌కుమార్, హరిణి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చుండ్రు వెంకన్నరాయచౌదరి, ట్రెజరర్ యిళ్ల ఆదేశ్, జెమ్మీ, సుంకర చంటి, సాధనాల శ్రీనివాసరావు, గరగ రామయ్య, బొడ్డు భాస్కర రామన్, చుండ్రు శ్రీధర్, మెర్ల రాజేంద్ర, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రోబోటిక్ అప్లికేషన్లపై ముగిసిన శిక్షణ

జేఎన్టీయూకే, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ సెమినార్ హాల్లో ఐఐఐటీ, కోయంబత్తూర్‌లోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోబోటిక్ అప్లికేషన్లల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడంపై 3రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శనివారం ముగిసింది. డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాద్ ముఖ్యఅతిథిగా... డాక్టర్ రాజా, భువనేశ్వరి రీసో ర్స్ పర్సన్స్‌గా, డాక్టర్ దుర్గాగంగారావు సమన్వయకర్తగా వ్యవహరించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోబోటిక్స్, ఐవోటీ, ఏఐ తదితర సాంకేతిక కోర్సులలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణనిచ్చేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. విద్యార్థులు అభివృద్ధి చేసిన రోబోటిక్స్ నమూనాల వివరాలను అడిగి వాటి పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు రిజిస్ట్రార్ సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో యూసీఈకే అధ్యాపకులు ఐడియల్, ఆదిత్య, యూసీఈకే, ప్రైడా ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



వర్సిటీ రిజిస్ట్రార్, డైరెక్టర్‌తో శిక్షణ పొందిన విద్యార్థులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఉప్పలపాడులో భారీ అన్నదానం

గండేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉప్పలపాడు గ్రామానికి చెందిన జ్యోమల రాంబాబు ఆధ్వర్యంలో శివాలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీసంఖ్యలో భక్తులు హాజరై ముందుగా ఉసిరి చెట్టు వద్ద శివుడికి పూజలు చేసి అన్నప్రాదాలు స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మినీ అంగన్వాడీలను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

చింతూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ నేతృత్వంలో శనివారం చింతూరు లో డివిజను పరిధి అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6000 మినీ అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లలో వర్కర్‌తోపాటు సహాయకురాలు పనుల ను కూడా ఒక్కరే నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వేతనం మాత్రం సహాయకురాలుకు చెల్లించే స్థాయిలోనే ఉందన్నారు. ఈ సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా మన్నారు. చివరకు 42 రోజుల పాటు సమ్మె చేయాల్సిన పరి స్థితి ఏర్పడిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే మినీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు నాడు హామీ ఇచ్చారన్నారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మినీ అంగన్వాడీలు ఆశలు పెట్టుకున్నారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించలేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమరం పెంటయ్య, సహాయ కార్యదర్శి పొడియం లక్ష్మణ్, అంగన్వాడీ యూ నియన్ జిల్లా అధ్యక్షరాలు ముసురు రాజేశ్వరి, అంగన్వాడీ నాయకులు సున్నం రంగమ్మ, నూకరత్నం, అన్నపూర్ణ, విజయకుమారి, సుబ్బారావు, పార్వతి, వసంత, దుర్గ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. చివరిగా తమ సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి

దేవీపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజె క్టు వల్ల ముంపునకు గురైన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు శనివారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు వల్ల 371 గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారన్నారు. నిర్వాసితులకు 65 గ్రామాలకు గృహాలు నిర్మించారని ఇంకా 306 గ్రామాలకు గృహాలు నిర్మించాలి. దేవీపట్నం మండలంలో దేవీపట్నం, పూడిపల్లి వంటి గిరిజనేతర గ్రామాలకు గృహ సముదాయాలు నిర్మించకుండా గ్రామాలు ముంపునకు గురిచేశారు. నిర్వాసితులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. జగ్గంపేట నియోజకవర్గం గోకవరం గ్రామ సమీపాన గృహనిర్మాణాలు ఏర్పాటు చేసిన పూర్తికాలేదు. ఈ సమస్య పరిష్కరించాలి. ముంపునకు గురైన గ్రామాలు ఖాళీ చేసేనాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

గిరిజనేతరులకు ఇళ్లు మంజూరు చేయాలి

● మంత్రులను కలిసిన టీడీపీ నాయకులు



సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఎటపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మన్యంలో గిరిజనే తరులకు కూడా ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయాలని, ఆదిశగా సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోల వీరాంజనేయస్వామిని ఎటపాక టీడీపీ నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, పాటి సంపత్ కోరారు. ఈమేరకు శనివారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిసి విన్నవించారు. ఎటపాకలో అగ్నికల్చర్‌కు సంబంధించి త్రీఫేస్ విద్యుత్ లైన్‌ను మంజూరు చేయాలని ఆశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. స్పందించిన విద్యుత్‌శాఖ మంత్రి వెంటనే పాడేరు విద్యుత్ ఉన్నతాధికా రులతో మాట్లాడారు. వెంటనే ఎటపాకలో త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆశాఖ మంత్రి ఆదేశించారని టీడీపీ నాయకులు చెప్పారు. ఈక్రమంలోనే జనవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి, ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు గోదావరి నదీ పక్కన 5 కిలోమీటర్ల మేర కరకట్ట మంజూరు చేయాలని కోరారు. నాలుగు విలీన మండలాల్లో భూములకు నష్టపరిహారంతో పాటు ముంపునకు గురయ్యే గ్రామాలన్నింటికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎటపాక మండల ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్, రంజిత్ కుమార్ ఉన్నారు.

మద్యంతో ముగ్గురి అరెస్టు

● ముగ్గురిపై కేసు నమోదు

వరరామచంద్రాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్న వీఆర్‌పురం పోలీసులు, ముగ్గురుపై కేసు నమోదు చేశారు. మండలంలోని చింతరేవుపల్లి, రామవరం గ్రామాల్లోని ముగ్గురు వ్యక్తులు అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని శుక్రవారం వీఆర్‌పురం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పట్టుకున్నారు. రెండు కేసులు చింతరే వుపల్లి గ్రామంలోను, 1 కేసు రామవరం గ్రామంలో పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆ ముగ్గురుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మండలంలో బెల్టుషాపులు ఎ వరు నిర్వహించి నా కటినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఈఎంఆర్‌ఎస్ విద్యార్థులకు క్రీడా ఎంపిక పోటీలు

రంపచోడవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల జయంత్యోత్సవాలలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 18 నుంచి ఐదు రోజులపాటు రంపచోడవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఆర్చరీ, జవెలె న్‌త్రో, వాలీబాల్ తదితర క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి కంగల పోతురాజు శనివారం ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో ప్రతిభ గల విద్యార్థులను ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయాయ ఉపాధ్యాయులు ఎంపిక పోటీలకు తీసుకురావాలని, ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23 నుంచి విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

అంతర్గత రహదారులు అభివృద్ధి చేయాలి

ఎటపాక, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయనపేట-గుండాల పంచాయతీ పరిధి గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు ఎంపీడీవో కార్యాలయంలో రహదారుల మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐవీ మాట్లాడారు. గుండాలలోని జాతీయ రహదారి నుంచి గుండాల కాలనీమీదుగా ఎర్రబోరు వరకు రహదారులు అభివృద్ధి చేయాలని, కేఎన్‌పురం గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి సెయింట్‌ఆన్స్ పాఠశాల జంక్షన్ వరకు రోడ్లు మంజూరీ చేయాలని అభ్యర్థించారు. ఈ రెండు గ్రామ పంచాయతీల్లో రహదారులు అభివద్ధి చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇర్పాసత్యం, నూతలపాటి సుధాకర్ రావు,పి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

20న గండిపోశమ్మ దర్శనం

దేవీపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో ఉన్న శ్రీ గండిపోశమ్మ అమ్మవారి దేవాలయంవద్ద గోదావరి వరద తగ్గిన కారణంగా ఈనెల 20న ఉదయం 9గంటల నుంచి అమ్మవారి దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు ఆలయ జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అమ్మవారికి సంప్రోక్షణచేసి దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

లోతట్టులో న్యాయ విజ్ఞాన సదస్సు

అడ్డతీగల, నవంబరు16: అడ్డతీగల మండలం లోతట్టు గ్రామమైన జల్లూరులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించామని సీనియర్ పారా లీగల్ వలంటీర్ తీగల.బాబురావు తెలిపారు. గిరిజన ప్రజలకు చట్టాలపై అవగాహన కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా న్యాయ సలహాలు ఏవిధంగా పొందాలో వివరించి చట్టలపై అవగాహన ఉండాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొని వచ్చారన్నారు.

లాభసాటిగా బంతిపూల సాగు

టన్ను బంతిపూలు ధర రూ.50వేలు
ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



భౌరువాక గ్రామంలో విరగబూసిన బంతితోట

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బంతి తోటలు విరబూయడమే కాకుండా రైతన్నలకు లాభాలు తెచ్చేపూబంతిగా మారాయి. మెట్ట ప్రాంతానికి చెందిన ప్రత్తిపాడు మండలంలో రైతులు బంతితోటల పెంపకంపై లాభాలు రావడంతో ఆసక్తి చూపుతున్నారు. దీంతో మండలంలోని ధర్మవరం,భౌరువాక తదితరగ్రామాల్లో రైతులు బంతితోటలను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.50వేలు పెట్టుబడిపెట్టి లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం టన్ను బంతిపూలు ధర రూ.50వేలు ధర పలుకుతుండడంతో బంతిపూల సాగు రైతుల పంట పండినట్లు అ యింది. ఒక ఎకరం బంతి పూలసాగు 4నుంచి 5 టన్నులు బంతిపూల దిగుబడి ఇస్తుండటంతో రైతులకు ఈ పూలసాగు లాభసాటిగా మారింది. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో బంతిపూలకు విపరీతమైన డిమాండ్ పెరిగి తోటల వద్దకే కొనుగోలు దారులు తరలివెళ్లి 10కిలోలు రూ.500 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేస్తుండడంతో స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని మత్స్యకారుల నిరసన



సముద్రతీరంలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

తొండంగి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మత్స్యకారులు శనివారం తాటియాకుల పాలెం సముద్రతీరంలో మత్స్యకారుల ఆవేదన పేరిట నిరసన తెలిపారు. తీర ప్రాంతంలో సముద్రంపై ఆధారపడి రెండువేల కుటుంబాల వరకూ జీవిస్తున్నాయని, ఏడాదికి మూడు నుంచి నాలుగు లక్షల మేర ఆదాయాన్ని సంపాదించుకుంటున్నారన్నారు. ఇటీవల తీర ప్రాంతంలో ఫార్మా పరిశ్రమలు రావడం వల్ల వ్యర్థజలాలు సాగరంలో కలిసి మత్స్య సంపద పూర్తిగా నశించి పోయి ఉపాధిని కోల్పోతున్నామన్నారు. వీటి వల్ల నష్టపోతున్న తమకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమా ండ్ చేశారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి నెలనెలా 15వేల ఆర్థిక సహాయం అందించాలని, చ దువుకున్న వారికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.10లక్షల హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, మత్స్యకారులకు అవసరమైన పరికరాలు ఇవ్వాలని, కల్యాణ మండపం నిర్మించాలని తదితర డిమాండ్లతో శాంతి యుత నిరసన చేపట్టారు. తహశీల్దార్ మురార్జీ, ఆర్‌ఐ రాజారావు, తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు,తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ మత్స్యకారులతో మాట్లాడారు. డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని, ఇప్పటికే సమావేశ తేది ప్రకటించినందున అన్ని విషయాలు అక్కడ చర్చించవచ్చని తెలపడంతో వారు నిరసన విరమించారు. మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వరరావు, ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

21న తునిలో జాబ్‌మేళా

తుని రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న తుని నోబుల్ ఐటీఐ కళాశాల నందు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జీవీవీ.సత్యనారాయణ తెలిపారు. జాబ్‌మేళాలో ఇండో ఎంఐఎం, ఇన్నిలోమ్,పానాసోనిక్, ఇసుజు మోటార్స్, టాటా కెమికల్స్ లిమిటెడ్, ఇండస్‌కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, హోండాయ్ మోబీసీ కంపెనీ ప్రతినిధులు సంబంధిత కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఎస్ఎస్‌ఏ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమో ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని, వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.16వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఇన్సెంటీవ్స్, భోజనం, వసతి,రవాణా సౌకర్యం కల్పిస్తారని ఆయన తెలిపారు.

కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నింపేట ఇంటర్ స్నాక్స్ కాజు ఇండియా ప్రవేట్ లిమిటెడ్ వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. శనివారం ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు తమకు న్యాయం చేయాలని ఫ్యాక్టరీ గేటు ముందు ఆందోళన చేపట్టారు. జీడి పిక్కలు ఫ్యాక్టరీ యాజమాన్యం రాత్రికి రాత్రే సెలవులు ప్రకటించడంతో తాము జీవనోపాధి కోల్పోయామని సుమారు 450 మంది గగ్గోలు పెట్టారు. యాజమాన్యం దిగివచ్చి తమకు ఒక్కొరికి రూ.2లక్షల నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

కోటనందూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు సెంటర్‌లో యువతి అదృశ్యంపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... తుని మండలం ఎస్ఎస్ వెంకటనగరం గ్రామానికి చెందిన కలంకోటి విమల కోటనందూరు బస్‌స్టాండ్‌లోని టైలరింగ్ సెంటర్‌లో టైలరింగ్ నేర్చుకుంటుంది. యదావిధిగా శుక్రవారం సెంటర్‌కు వచ్చి దుస్తులు కొనుక్కుని వస్తానని చెప్పి బయటకు వచ్చి తిరిగి సెంటర్‌కు రాలేదు. అలాగే ఇంటికి కూడా రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కన్పించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఆమె తండ్రి సింహాచలం ఫిర్యాదుచేవాడు. దీంతో ఎస్‌ఐ టిరామకృష్ణ విచారణ చేపట్టామని తెలిపారు.

విలేకరులకు సత్కారం

జగ్గంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం జగ్గంపేట కృష్ణవేణి థియేటర్ వద్ద విలేకరులను జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ సత్కరించారు. విలేకరలు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్నారని తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

తొండంగి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ చర్య తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. కేజీబీవీ వాకదారిపేటలో శనివారం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ బాల బాలికలకు హక్కులను హరించేవారిపై చర్యలు ఉంటాయన్నారు. 1098 ఫోన్ చేసి సమాచారం అందిస్తేవారికి ఎటువంటి ఇబ్బంది ఉన్నా రక్షణ లభిస్తుందన్నారు. బాల్య వివాహాలు, మహిళలు చిన్నపిల్లల పట్ల వివక్ష ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, శిశు గృహ మేనేజర్ నూకరత్నం, ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులున్నారు.

'భౌరువాకలో ప్రార్థనా మందిరం నిర్మాణం'



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉమర్ ఆలీషా

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భౌరువాక గ్రామంలో ప్రార్థనా మందిరం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా తెలిపారు. శనివారం భౌరువాక ఉమర్ ఆలీషా ఆశ్రమంలో జ్ఞాన చైతన్య సదస్సుకు డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షత వహించి ప్రసంగించారు. తన తండ్రి మోహిద్దీన్ బాషా ప్రార్థనా మందిరాన్ని త్వరలోనే నిర్మించి పూర్తిచేస్తామని తెలిపారు. గిరిజనులు 150 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆంధ్ర శబరి మలై దేవాలయ నిర్మాత కుసుమంచి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి డాక్టర్ ఉమర్ ఆలీషా మార్గం చూపారని చెప్పారు. ఉమర్ ఆలీషా సోదరుడు అహ్మద్ ఆలీషా, మహబూబ్ బాషా, కబీర్‌షా, హుస్సేన్‌షాలతో కలిసి మోహిద్దీన్ బాషా చిత్రపటానికి ప్రార్థనలు చేసి నివాళులర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఎన్‌టీవీ ప్రసాద వర్మ, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యులు ఏవీవీ సత్యనారాయ ణ, గొంతిన అబ్బాయిలు ప్రసంగించారు. రామసీత, తలుపులమ్మ, జానికమ్మ గేయాలు ఆలపించారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బీజేపీ సమావేశం

కిర్లంపూడి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురంలో బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు అధ్యక్షతన పర్వ 2024 సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు హాజరై బూత్ కమిటీల నియామకాలపై వివరించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ మాట్లాడుతూ అన్ని బూత్ కమిటీల ఎన్నికలు నిర్దేశించిన సమయంలోగా నిర్వహించాలని సూచించారు. నాయకులు కోన వెంకట సురేష్, శరకణం రాజు, దొడ్డ అప్పారావు, జ్యోతుల దుర్గాప్రసాద్, మచ్చా వెంకటరమణ; గొడే లక్ష్మి, ఏనుగుపల్లి జలబాబు పాల్గొన్నారు.

ముగిసిన చండీయాగం

గండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య విద్యా ప్రాంగణంలో సహస్ర చండీ యాగం శనివారం ముగిసింది. ఆదిత్య యాజమాన్యం డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు, డాక్టర్ సతీస్‌రెడ్డి, శృతిరెడ్డి దంపతులు, కృష్ణదీపక్‌రెడ్డి, సుగుణరెడ్డి దంపతులు, చైతన్య గ్రూప్ అధినేతలు చింతా వెంకటరెడ్డి దంపతులు, జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దంపతులు, పాల్గొన్నారు. చివరి రోజు పూర్ణాహుతి నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు.



ఆదిత్యలో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాస్వామ్య పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

రంపచోడవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పత్రికా, భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని అఖిల భారతరైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా దూలయ్య అన్నారు. శనివారం స్థానిక మార్క్స్, ఎంగిల్స్ భవనంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకుడు డి.నాగరాజు అధ్యక్షతన జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంజా దూలయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఏకపక్షంగా అన్యాయానికి ఒడిగట్టిందని, అంతేకాకుండా ఒక కొత్త పథకం ప్రవేశపెట్టలేదన్నారు. పీడీఎస్‌యూ పూర్వా ధ్యక్షుడు ఐ.వీ.రమణ మాట్లాడుతూ పత్రికా, భావ ప్రకటన స్వేచ్ఛ పరిరక్షణ అంశంలో మనదేశం 164వ స్థానానికి దిగజా రిందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదికలో వెల్లడించిందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.రమేష్‌రెడ్డి, కె.విక్రందొర, లక్ష్మణ్‌రెడ్డి, సంధ్యారాణి, ధర్మారెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేను సైతం అంటూ పూర్వపు విద్యార్థి



చేతులమీదుగా గౌరవ వేతనం అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): డొంకరాయిలో గల మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలకు బోధన సిబ్బంది కొరత ఉన్నందున స్థానిక ఎంపీటీసీ కరకా వెంకట రమణ ఈ ఏడాది జూన్ నుంచి ఐదుగురు విద్యావలంటీర్లను గ్రామంలో చదువుకున్న యువతలను ఎంపికచేసి వారికి తన సొంత ఖర్చుతో నెలకు రూ.19వేలు ఇస్తూ నిరుపేద గిరిజనుల పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూస్తున్నారు. ఎంపీటీసీ రమణ స్ఫూర్తితో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన డొంకరాయి పూర్వపు విద్యార్థిని ఈనెల విద్యావలంటీర్లకు అయ్యే మొత్తం గౌరవవేతనం రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆ సొమ్మును ఎంపీటీసీ రమణ, ఎస్‌ఐ శివకుమార్, క్యాంపు ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శివశంకర్ చేతులమీదుగా విద్యావలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, వారి సిబ్బంది, సీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుని సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రసంగం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో తునిలో తిష్టవేసిన పలు సమస్యలు, ప్రజల కష్టాలను ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీలో వినిపించారు. తుని ఏరియా ఆసుపత్రిలో పరిస్థితిని వివరిస్తూ థైరాయిడ్, ఎంఆర్‌ఐ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని, రక్తనిల్వలు భద్రపరిచేందుకు వసతులు కల్పించాలని ఆమె రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రిని కోరారు. ఈ ఆసుపత్రికి తుని నుంచే కాకుండా అటు ప్రత్తిపాడు, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల నుంచి కూడా వైద్యసేవలకు వస్తుంటారని గుర్తు చేశారు.

'75 శాతం అపార్ నమోదు పూర్తి'

ప్రత్తిపాడు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటర్ వరకు విద్యాభ్యాసం చేసే విద్యార్థులు 10,600మంది ఉండగా ఇప్పటి వరకు 8007మందికి అపార్ నమోదు చేసినట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని అపార్ నమోదుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 75 శాతం అపార్ నమోదు పూర్తయిందని, మిగిలిన 25శాతం నమోదుపై అధికారులు చర్యలు తీసుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

'పామాయిల్ పంటతో అధిక దిగుబడులు'

కోటనందూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్‌మేనేజర్ బివెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కొట్టాం గ్రామంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పామాయిల్ పంట వల్ల అధిక దిగుబడులతో మంచి లాభాలు ఆర్జించవచ్చునన్నారు. ప్రస్తుతం టన్ను రూ.19,500 ఉందన్నారు. ఎకరాకు రూ.70వేల నుంచి రూ.1 లక్ష వస్తుందన్నారు. ప్రతీ రైతు పామాయిల్ పంట వేయాలని, అందుకనుగుణంగా ఉచితంగా మొక్కలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి జెఅయ్యప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎమ్‌చక్రధర్, రైతులు ఉన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

జగ్గంపేట రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గొల్లలగుంట జడ్పీ హైస్కూల్లో బాలికలకు వారి రక్షణ, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ మాట్లాడుతూ డయల్ 112, 102, 9494933233 వాట్సాప్ నెంబర్లపై మహిళలకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థినులకు వారి స్వీయ భద్రత మహిళా బాలబాలికల సంరక్షణ చట్టాలు, చిన్న పిల్లలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, జాగ్రత్తలపై సీఐ అవగాహన కల్పించారు.

యనమలను కలిసిన గవర కార్పొరేషన్ చైర్మన్

తుని రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేందర్, తునికి చెందిన గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల గణేష్‌కుమార్‌తో కలిసి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తుని మాజీ మున్సిపల్ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ, చింతమనేడి నాగ సోమరాజు తదితరులు ఉన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



ఏలేశ్వరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన మూది నారాయణస్వామికి ఆయన ఇంటి వద్ద శనివారం పలువురు టీడీపీ శ్రేణులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, బుగతా శ్రీనివాస్, బంక రాజు, కోరాడ కృష్ణ మోహన్, సామంతుల భాష్కరరావు, కర్రోతు గాంధీ, శిడగం రామకృష్ణ, తదితరులున్నారు.